క్లుప్తంగా

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



తెనాలిఅర్బన్: ఆర్ఎం ఫౌండేషన్ ఇండియా సంస్థ వ్యవస్థాపకులు రెవరెండ్ పల్లె శామ్యూల్ ఆధ్వర్యంలో సోమవారం 13వ వార్డులోని ఆర్ఎం చర్చిలో 50 మంది పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఝాన్సీరాణి, రోహి, మరియమ్మ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఐఎంఏలో వైద్యసేవలపై అవగాహన



తెనాలిరూరల్: స్థానిక బోసురోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యాలయంలో కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సీఎంఈ) కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ శశిభూషణ్ పాల్గొని పలు అంశాలపై ప్రసంగించారు. ముఖ్యంగా అప్పుడే పుట్టిన బిడ్డకు చేయాల్సిన వైద్య పరీక్షల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐఎంఏ ఉపాధ్యక్షుడు డాక్టర్ అనిల్ కుమార్, కార్యదర్శి డాక్టర్ పావని ప్రియాంక, సహాయ కార్యదర్శి డాక్టర్ జి.మధు ప్రభాకర బాబు, డాక్టర్ జె.కోటినాగయ్య, డాక్టర్ జి. నరసింహా రావు, డాక్టర్ భానుప్రసాద్, డాక్టర్ శేష గిరిరావు, డాక్టర్ ఎల్‌వీ ప్రసాద్, డాక్టర్ శివ ప్రసాద్‌బాబు, డాక్టర్ గిరిజ, డాక్టర్ సరోజిని, డాక్టర్ నీలిమ, డాక్టర్ శ్రీ విద్య తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వినికిడి యంత్రాలు పంపిణీ




తెనాలిఅర్బన్: ఆశాజ్యోతి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో బాలాజీ రావుపేటలోని భవిత కేంద్రంలో వినికిడి లోపంతో బాధపడుతున్న ఆరుగురు పేద విద్యార్థులకు సోమవారం హియరింగ్ మిషన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మేకల లక్ష్మీనారాయణ, జయంతి బాబులు మాట్లాడుతూ ఒక్కో వినికిడి యంత్రం రూ.19,500 అవుతుందని, వాటిని ఆశాజ్యోతి ఫౌండేషన్ నిర్వాహకులు ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. అనంతరం పండ్లు, స్వీట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు తారా కుమార్, శశాంక్, ఆడియాలజిస్ట్ త్రివిక్రమ్, హెచ్ఎం నందకుమార్, సీఆర్పీ శ్యామ్, టీచర్లు వై.రజనీకుమారి, డి. సునీత పాల్గొన్నారు.

కోనోకర్పాస్ మొక్కలు తొలగించండి



తెనాలిఅర్బన్: పట్టణంలోని కోనోకర్పాస్ మొక్కలు పర్యావరణానికి, ప్రజల అనారోగ్యానికి కారణమని వాటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని సత్యం, శివం, సుందరం సామాజిక సేవా కేంద్రం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నను కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. టీడ్కో గృహంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని, చెంచుపేటలో నిర్మిస్తున్న కల్యాణ మండప నిర్మాణ పనులు నిలిపివేయాలని, శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తొలగించాలని తదితర ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. సోమవారం వచ్చిన ఐదు ఫిర్యాదులను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనూష, ఎసీపీ సుబ్బారావు, ఆర్‌వో సోమశేఖర్ యాదవ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

తెరపివ్వని వర్షం



తెనాలిఅర్బన్: అల్పపీడన ప్రభావం వలన తెనాలిలో మూడు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. సోమవారం తెల్లవారుజాము నుంచి చిరుజల్లులతో కూడిన వర్షం పడుతూ ఉంది. దీంతో ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజల, ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సాయంత్రం వరకూ చిరుజల్లులు కురుస్తునే ఉన్నాయి.

చంద్రన్నా.. భృతి భ్రాంతేనన్నా?

'అడిగిన జీతం బియ్యని మిడిమేలుపు దొరనుగొల్చి మిడుకుట కంటెన్ /వడి గల యెద్దుల గట్టుక మడిదున్నుక బ్రతకవచ్చు మహిలో సుమతీ' అని శతకారుడు ఎప్పుడో చెప్పిన చక్కని మాట. 'మా ప్రభుత్వం వస్తే మీ జీవితాలు మారిపోతాయంటూ' నిరుద్యోగులకు ఆశచూపి తీరా ఇవాళ ముఖం చాటేస్తున్న కూటమి పాలకుల నిర్వాకాన్ని పలువురు ఎండగడుతున్నారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో మమ్మల్ని ఓటువేయించేలా ఫిక్స్ చేసి మోసం చేశారంటూ వాపోతున్నారు.

- ఆశగా ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత
- ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఊసు మరచిన పాలకులు

తెనాలి: నిరుద్యోగ యువత ఇప్పుడు ఎక్కడబడితే అక్కడ కనిపిస్తున్నారు. ఇంజినీరింగ్ వంటి ఉన్నత కోర్సులు చేసినప్పటికీ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో రెసిషన్‌తో ఉద్యోగాలు దుర్లభంగా మారాయి. దీంతో పలువురు యువకులు పొలం పనులకు, భవన నిర్మాణ పనులకు, క్యాటరింగ్ వర్కర్లుగా చేస్తున్నారు. అదే ఉద్యోగం రాని యువతులైతే మారుమాట్లాడకుండా పెద్దలు చెప్పినట్టు పెళ్లి చేసుకుని ఇంటివాళ్లవుతున్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సులు చేసిన ఎందరో ఉద్యోగాలు లేక నిరాశా నిస్పృహలతో గడుపుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి సిఫార్సులు లేకుండా కేవలం ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలను కల్పించారు. అప్పట్లో సచివాలయ ఉద్యోగాలు, వైద్య ఆరోగ్య శాఖలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాలనూ భర్తీచేశారు. ఇంకా ఎందరో నిరుద్యోగులు ఉద్యోగాల భర్తీ కోసం ఎదురుతెన్నులు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో గత ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నిరుద్యోగ యువతలో సరికొత్త ఆశల్ని రేపింది. రాష్ట్రంలో 20 లక్షల ఉపాధి అవకాశాల కల్పన / నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల భృతి ఇస్తామంటూ ఊరూరా ఊదరగొట్టారు. ఆయా పార్టీల నేతలు

- ఫరీద్ అనే యువకుడు ఐటీఐలో డీజిల్ మెకానిక్ ట్రేడ్ పూర్తిచేశాడు. ప్రైవేటు కంపెనీలో అప్రెంటిస్ కూడా పూర్తిచేశాడు. ఉద్యోగం మాత్రం రాలేదు. రెండు మూడేళ్లు వేచిచూసి ఇక లాభం లేదనుకుని తండ్రి చేస్తున్న టైల్స్ ఫ్లోరింగ్ పనికి వెళుతున్నాడు.
- డిగ్రీ చేసిన ఏ.శ్రీనివాస్‌దీ ఇదే పరిస్థితి. ఎలాంటి సాంకేతిక అర్హత లేదనే సాకుతో ఏ ప్రైవేటు కంపెనీ ఉద్యోగం ఇవ్వలేదు. చేసేది లేక ఇంటిదగ్గరే ఖాళీగా ఉండటంతో తల్లిదండ్రులు రోజూ తిట్టిపోస్తున్నారని ఆవేదన పడుతున్నాడు.
- ఫార్మసీ కోర్సు పూర్తి చేసిన మరో వ్యక్తిదీ ఇదే సమస్య. పెళ్లయి పిల్లలున్నా ఉద్యోగం అతీగతీ లేదు. 30 ఏళ్లు దాటాయి. ఇంకా పెద్దల సంపాదనతోనే జీవిస్తున్న అతడి మానసిక వేదన అంతాఇంతా కాదు.



ఎన్నికల వేళ సూపర్ సిక్స్ పేరుతో నిరుద్యోగ యువతకు కూటమి అందించిన మేనిఫెస్టో

సూపర్‌సిక్స్ హామీల కరపత్రాలతో ఇంటింటికీ వెళ్లారు. ఓటర్లకు నమ్మబలికారు. చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు ఇద్దరూ కలిసి మేనిఫెస్టో విడుదల చేయటంతో ఈసారి ఖచ్చితంగా ఇస్తారని ఉద్యోగాలు అందని పండుగా మారి నిరాశతో ఉన్న యువతీ యువకులు ఆశపడ్డారు. ఓట్ల పండగ రోజున పెద్ద ఎత్తున ఓట్లు వేసి మద్దతుగా నిలిచారు. సూపర్ సిక్స్ హామీలతో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి నెలరోజులైంది. రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరుతో 16 వేల పోస్టుల భర్తీ కూడా ఈ ఏడాదిలోగా జరిగేలా కనిపించటం లేదంటున్నారు. ఇక ఏపీపీఎస్సీ, టెట్, ఇంటర్ అర్హతలతో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం ఎదురుచూస్తూ కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్నవారు ఎందరో ఉన్నారు. చదువులు పూర్తయి ఉద్యోగాలు లేక, తిండితోపాటు చేతిఖర్చులకూ పెద్దలపైనే ఆధారపడుతున్న తమకు ఊరట కలిగించేలా నిరుద్యోగ భృతిపై ప్రభుత్వ పెద్దలు కనీసం ప్రకటన చేయటం లేదని మదనపడుతున్నారు. జాబ్ క్యాలెండరు, నిరుద్యోగ భృతి ఎప్పటి నుంచి ఇచ్చేది ప్రకటన చేసి మాట నిలుపుకోవాలని కోరుతున్నారు.

గతంలోనూ ఇదే తంతు!

2014 ఎన్నికల్లోనూ జాబు రావాలంటే బాబు రావాలి అని ప్రచారం చేశారు. అందుకు తగినట్టే ఇంటికొక ఉద్యోగం, లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు నాయుడు హామీనిచ్చారు. ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చాక ఆ హామీని తుంగలో తొక్కారు. తీరా 2019 ఎన్నికలకు ముందు నామ్‌కే వాస్తేగా కొంత మందికి నిరుద్యోగ భృతి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. మళ్లీ 2024 ఎన్నికల్లో సూపర్‌సిక్స్‌లో మొట్టమొదటి హామీనే 20 లక్షల ఉద్యోగాలు / నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి అనేది తెలిసిందే. 2014–19లో చేసినట్టు కాకుండా ఈసారైనా రాష్ట్రప్రభుత్వం హామీని అమలుచేసి, నిరుద్యోగులను ఆదుకోవాలని కోరుతున్నారు.

- తెనాలి నియోజకవర్గంలో 81,301 కుటుంబాలు నివసిస్తున్నాయి. నిరుద్యోగులు 40 వేల మందికి పైగా ఉంటారని అంచనా ఉంది. పట్టణంలో 36,479 కుటుంబాలకు 25 వేల నిరుద్యోగులు ఉండగా, తెనాలి రూరల్ మండలంలో 22,800 కుటుంబాలకు 10 వేల మంది, కొల్లిపర మండలంలో 22 వేల కుటుంబాలకు ఏడు వేలమంది నిరుద్యోగులు ఉన్నట్టు అనధికార అంచనా. గతంలో ఇచ్చినట్టుగా వయోపరిమితిని 22–35 ఏళ్లకు ప్రకటించకుండా ఏపీపీఎస్సీ అభ్యర్థులకు గల వయోపరిమితి ప్రకారం భృతిని ఇవ్వాలని కోరుతున్నారు.

నిరుద్యోగ భృతిపై స్పష్టత ఏది?



సార్వత్రిక ఎన్నికలకు ముందు కూటమి పార్టీల అధినేతలు నిరుద్యోగులకు భృతి ఇస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటుతున్నా ఇప్పటి వరకు నిరుద్యోగ భృతిపై స్పష్టత ఇవ్వలేదు. పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నా. కనీసం ఉద్యోగాల నోటిఫికేషన్‌లు ఇవ్వాలి. నిరుపేదల కుటుంబంలో జన్మించిన మాలాంటి నిరుద్యోగులను ప్రభుత్వం ఆదుకునే చర్యలు చేపట్టాలి.

– కె.చిట్టిబాబు, చెంచుపేట, తెనాలి.

నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలి



ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రతి నిరుద్యోగికి ఉద్యోగం లేదా భృతి ఇస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి విద్యార్హతలను చెప్పలేదు. అందుచేత ఇంటర్ వరకు చదివిన నాలాంటి వారికి కూడా ప్రభుత్వ ఉద్యోగం లేదా నిరుద్యోగి భృతి ఇస్తే ఆదుకున్నట్టు అవుతుంది. ప్రభుత్వం దీనిపై వెంటనే ప్రకటన చేయాలి.

– పాడిబండ్ల కిరణ్, తూములూరు

పేదలకు అన్నదానం



తెనాలి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు 68వ జన్మదినం సందర్భంగా సోమవారం స్థానిక రైల్వేస్టేషను రోడ్డులో శ్రీశివలింగేశ్వర భక్తబృంద సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ, బీసీ నాయకులు మోర్ల శ్రీను, కుర్రా శ్రీను, కొల్లూరు హనుమంతరావు, వేముల కృష్ణ, శీను, జొన్నాదుల వెంకటసాయి, కురుగంటి రవిశంకర్, పాశం వెంకటేష్, మేడిపల్లి ప్రభాకర్, షేక్ మౌలాలి, తుల్లిమల్లి చంటి, బంగారు పోతురాజు ప్రభృతులు పాల్గొని, శంకరరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. తొలుత బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో సంఘ తెనాలి నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

మీ కోసంలో ఏడు అర్జీలు

తెనాలిరూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమంలో ఏడు అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వీటిలో సర్వే కోసం రెండు, అడంగల్‌లో మార్పుల కోసం ఒకటి, సబ్‌రిజిస్ట్రార్, పంచాయతీ రాజ్ శాఖలకు సంబంధించి ఒక్కో అర్జీ, ఇతర సర్టిఫికెట్‌ల కోసం రెండు అర్జీలు ఉన్నట్టు చెప్పారు. వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో పౌల్ట్రీ కార్మికుడు మృతి

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో పౌల్ట్రీ కార్మికుడు మృతి చెందిన ఘటన తెనాలిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం గోవాడకు చెందిన నల్లమోతు రమణయ్య (32) తెనాలి చెంచుపేటలోని పౌల్ట్రీలో పని చేస్తున్నాడు. ప్రతిరోజు బైక్‌పై తెనాలి వచ్చి వెళుతుంటాడు. ఈక్రమంలో మధ్యాహ్నం చెంచుపేట వెళుతుండగా ఓవర్ బ్రిడ్జి డౌన్‌లో ఎదురుగా వచ్చిన సరుకు రవాణా వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. మృతదేహాన్ని తెనాలి త్రీ టౌన్ పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెనాలి డివిజన్‌కు విషజ్వరం

- ప్రతిరోజు 15కి పైగా జిల్లా వైద్యశాలకు జ్వరపీడితులు రాక
- రోగులతో నిండిపోతున్న వార్డులు
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్యులు



జిల్లా వైద్యశాలలో ఓపీ కోసం క్యూలో ఉన్న రోగులు

తెనాలిఅర్బన్: తెనాలి డివిజన్‌లో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. తరచూ వర్షాలు కురుస్తుండటంతో ఎక్కువ మంది ప్రజలు వీటి బారిన పడుతున్నారు. గత వారం రోజులుగా విషజ్వరాలు, అతిసారం, డెంగ్యూ వంటి వ్యాధులతో బాధపడుతూ తెనాలి జిల్లా వైద్యశాలకు వస్తున్న వారి సంఖ్య పెరుగుతుంది. ప్రతిరోజు సగటున 15 మంది జ్వర పీడితులు, ముగ్గురు అతిసారంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం వస్తున్నారంటే వాటి తీవ్రత ఏమేరకు ఉందో మనకు అర్థమౌతుంది. తెనాలి జిల్లా వైద్యశాలలో ప్రతిరోజు వెయ్యికి పైగా ఓపీ ఉంటుంది. వాటిలో సాధారణ జ్వరపీడితులు 15 మంది ఉంటున్నారు.

వీరు కాకుండా అతిసారంతో బాధపడే వారు ప్రతిరోజు ముగ్గురు ఉంటున్నారు. వీరందరూ ప్రతిరోజు జిల్లా వైద్య శాలకు వచ్చి కొందరు ఇన్‌పేషంట్‌లుగా, మరికొందరు అవుట్ పేషెంట్‌లుగా చికిత్స పొందుతున్నారు. వారం రోజుల నుంచి జ్వరపీడితుల సంఖ్య పెరిగిందని వైద్యులు చెబుతున్నారు. అలాగే కొద్దిరోజుల క్రితం డెంగీ వ్యాధితో బాధపడే ఒకరు చికిత్స నిమిత్తం తెనాలి వచ్చినట్లు వైద్యులు తెలిపారు. జ్వరపీడితులలో ఎక్కువగా తెనాలి, వేమూరు, మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని తెనాలి, కొల్లిపర, కొల్లూరు, దుగ్గిరాల, వేమూరు, రేపల్లె, అమృతలూరు, చుండూరు తదితర మండలాల వారు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి.



జ్వరపీడితులతో నిండిన వార్డు

నిండిపోతున్న వార్డులు

తెనాలి జిల్లా వైద్యశాలలోని మెడికల్ వార్డులు జ్వర పీడితులతో నిండిపోతోంది. ప్రతిరోజు వీరి సంఖ్య పెరుగుతుండటంతో వైద్యశాల అధికారులు అందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. అలాగే చికిత్సకు అవసరమైన మందులను కూడా దాదాపు అందుబాటులో ఉంచారు. వాధి నిర్ధారణ పరీక్షలు చేసి త్వరగా రిపోర్టులు అందించే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. అతిసారంతో బాధపడుతూ వచ్చే వారికి కూడా అవసరమైన మందులు అందుబాటులో ఉంచారు. అలాగే బ్లడ్ బ్యాంక్ ఎదురు ఉన్న వార్డును జర్వాల వార్డుగా ఏర్పాటు చేశారు. దానిలో జ్వరపీడితులు, డెంగీ, అతిసార వ్యాధిగ్రస్తులకు అక్కడ చికిత్స అందిస్తున్నారు.

అప్రమత్తతోనే వ్యాధుల నివారణ



దోమకాటు, వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల ఎక్కువగా జ్వరాలు వస్తుంటాయి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలను చాలా వరకు నియంత్రించవచ్చు. అలాగే దోమతెరలు, దోమల నియంత్రణకు సంబంధించిన కాయిల్స్‌ను వాడతుండాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. వేడి ఆహారం తీసుకోవాలి, జ్వర లక్షణాలు కన్పించిన వెంటనే ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందాలి.

–డాక్టర్ టి వినీల్, ఫిజీషియన్, జిల్లా వైద్యశాల, తెనాలి

జ్వరాలు ఎదుర్కొనేందుకు సిద్ధం



తెనాలి జిల్లా వైద్యశాలకు ఎక్కువగా జ్వరపీడితులు వస్తున్నారు. సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో రోగులకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అలాగే బ్లడ్ బ్యాంక్ ఎదురు ఉన్న వార్డులో జ్వరపీడితులు, డెంగీ రోగులను పెట్టి చికిత్స అందిస్తున్నాం. జిల్లా వైద్యశాలలోనే డెంగీతో సహ అన్ని నిర్ధారణ పరీక్షలు చేసే అత్యాధునిక ల్యాబ్ ఉంది. రోగులకు అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాం.

–డాక్టర్ సౌభాగ్యవాణి, సూపరింటెండెంట్, జిల్లా వైద్యశాల, తెనాలి.

ఫిర్యాదులు రాకుండా చూసుకోండి



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న



సమావేశంలో పాల్గొన్న అధికారులు

మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: సచివాలయంకు వచ్చిన ప్రజలతో మర్యాద వ్యవహరించడంతో పాటు వాటి నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. ఐతానగర్‌లో సోమవారం పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ సులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. అనంతరం సచివాలయం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సచివాలయంకు వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

తెనాలిఅర్బన్: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు తెనాలి పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో సోమవారం పోలీసు, ఆర్టీసీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు వీటి ఏర్పాటు ఎంతో దోహద పడుతుందన్నారు.

పట్టణంలోని ఏయే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయాల్లో పరిశీలన చేయాలని సూచించారు. సమావేశంలో సీఐలు దశరథ రామారావు, సుధాకర్, రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు, ఇన్‌ఛార్జి మున్సిపల్ ఇంజినీర్ శ్రీనివాసరావు, డీఈలు నాగభూషణం, సుబ్బారావు, ఏసీపీ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. అప్రమత్తంగా ఉండండి



నీటి నమూనాలను పరిశీలిస్తున్న మలేరియా అధికారి ఉమాకాంత్

తెనాలిఅర్బన్: వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలందరూ వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెనాలి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఉమాకాంత్ కోరారు. సోమవారం పట్టణంలోని గాంధీనగర్‌లో ఇంటింటి సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, విష జ్వరాలు, డెంగ్యూ వంటివి సోకే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నీటి నమూనాలను సేకరించారు. సూపర్‌వైజర్లు మల్లేశ్వరరావు, విశ్వేశ్వరరావు, డి.శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్‌లు షేక్ రషీద్, షేక్ నవీన్ పాల్గొన్నారు.

- పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం

లాం(తాడికొండ): పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం తప్పనిసరి అని లాం గ్రామ సర్పంచ్ షేక్ అబీదా అలీ అన్నారు. పచ్చదనం- పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా స్థానిక ముస్లిం కాలనీలో మొక్కల పెంపకం చేపట్టిన ఆమె.. మామిడి మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యతను స్థానికులు చేపట్టాలని సూచించారు.

ధరల పెరుగుదలతో పశుపోషణ భారంగా మారింది

సబ్‌కలెక్టర్‌కు మహిళా పాడిరైతుల వినతి

తెనాలి: మహిళా పాడిరైతులకు రాయితీతో కూడిన ఆర్థికసహాయం, జాయింట్ లయబిలిటీ గ్రూపుకు రిజర్వుబ్యాంక్ నిబంధనల కనుగుణంగా అదనంగా ఆర్థికసాయాన్ని ప్రభుత్వం ద్వారా ఇప్పించాలని పలువురు పాడిరైతులు, కౌలురైతులు కోరారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం సమావేశంలో వీరంతా సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్‌ను కలిసి తమ సమస్యను విన్నవించారు. పట్టణ అయితానగర్ పాడిరైతుల సంఘం నాయకులు వేజెండ్ల తబిత, మేకల అనసూయలు మాట్లాడుతూ పశుపోషణ భారంగా మారిందన్నారు. పాడిద్వారా జీవనం సాగిస్తున్న తమకు గేదెలతోపాటు వరిగడ్డి, తవుడు, దాణా ఖర్చులు విపరీతంగా పెరగటమే ఇందుకు కారణమన్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం ఆదుకోకుంటే తమకు ఇబ్బందులు తప్పవని చెప్పారు. ప్రభుత్వ ఆర్థికసంస్థలు, ప్రభుత్వం ద్వారా రాయితీతో కూడిన ఆర్థిక సాయం ఇప్పించాలని కోరారు. వల్లభాపురం మహి జాయింట్ లయబిలిటీ గ్రూప్ కన్వీనర్ వల్లభాపురం ధర్మయ్య, కో-కన్వీనర్ విజయరాణి మాట్లాడుతూ కౌలుభూమి సాగుతోపాటు పశుపోషణలో జీవిస్తున్న తమ గ్రూపుకు గోదావరి చైతన్య గ్రామీణ బ్యాంకు ఇస్తున్న రూ.5 లక్షల ఆర్థికసాయానికి తోడు అదనంగా ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఆ ప్రకారం వినతిపత్రాన్ని సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ పంటకాల్వలు, మురుగుకాల్వల్లో ఇంతవరకు గుర్రపుడెక్క, తూటికాడ తొలగించపోవటాన్ని సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. రోజూ కురుస్తున్న వర్షాలతో ఇప్పటికే పంటపొలాలు చెరువులుగా మారాయన్నారు. దీంతో ఖరీఫ్‌కు వరి వెదపెట్టిన చేలల్లో రైతులు ఆందోళన చెందుతున్నారని, సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించేలా చూడాలని కోరారు. వీరితో అత్తోట వీరయ్య, మాన్యం శ్యాంబాబు, మేకల కుమారి, శకుంతల, తెనాలి శాంతకుమారి, సరోజిని తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాడిరైతులు

'మీ కోసం'లో మొత్తం 11 అర్జీలు

సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మీకోస సమావేశానికి వివిధ సమస్యలపై మొత్తం 11 అర్జీలు వచ్చాయి. సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ వివిధ ప్రాంతాల్నుంచి వచ్చిన ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులచే నిర్ణీత వ్యవధిలో పరిష్కరించేలా కృషిచేస్తానని చెప్పారు.